1

నవతెలంగాణ

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం 10 జూన్ 2023

ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం దొంగతనం



నవతెలంగాణ-పటాన్‌చెరు

అర్ధరాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం నగదు దోచుకెళ్లిన సంఘటన పటాన్‌చెరు పట్టణంలో గురువారం అర్ధరాత్రి చోటు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని సాయిరామ్‌నగర్ కాలనీకి చెందిన ఎండి కమలుద్దీన్ గురువారం మధ్యాహ్నం తన కుటుంబంతో కలిసి పట్టణంలోని శాంతినగర్‌లో గల తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. అదే రోజు మధ్యరాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండగా లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా పగులగొట్టి అందులో ఉన్న 12 తులాల బంగారం 60 తులాల వెండి కొంత నగదు దోచుకెళ్ళినట్టు గుర్తించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై పవన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సీనియర్ జర్నలిస్టు వడ దెబ్బతో మృతి

మృతుని కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్



నవతెలంగాణ-కొల్చారం

మండల కేంద్రం కొల్చారం గ్రామానికి చెందిన మాజీ సీనియర్ జర్నలిస్టు అజీమోద్దీన్ (56) వడదెబ్బతో మృతి చెందా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. అజీమోద్దీన్ మృతి పట్ల ఆమె సంతాపం వ్యక్తం చేశా రు. వారి కుటుంబ సభ్యులకు అధైర్య పడొద్దని భరోసా కల్పిం చా రు. ఆమె వెంట కొల్చారం సర్పంచ్ సర్పంచ్ కరెంట్ ఉమ రాజా గౌడ్, జడ్పీటీసీ మేఘమాల సంతోష్, పొత్తంశెట్టిపల్లి మాజీ ఎంపీటీసీ చిట్యాల యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలట దుర్గాప్రసాద్, చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

వొడవని.. వడ్ల కొనుగోళ్లు

- కల్లాల్లో ధాన్యం రాసులు
- నైరుతీ రుతుపవనాల ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల వర్షాలు
- ఖరీఫ్ సాగు మొదలైనా.. చేతికందని ధాన్యం డబ్బులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

యాసంగీ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వరి కోతలు షురూ ధాన్యం మార్కెట్లోకి వచ్చే ముందే కొనుగోళు కేంద్రాల్ని ప్రారంభించాల్సిన అధికారులు 20 రోజులు ఆలస్యం చేశారు. వరి కోతలు షురూ అవగానే అకాల వర్షాలు కురిశాయి. దీంతో ధాన్యం తడుస్తుందని అధికారులు కేంద్రాలను పెట్టడంలో ఆలస్యం చేశారు. రైతులు మాత్రం అకాల వర్షాల వల్ల నష్టపోయారు. ఇప్పుడు సీజనల్ వర్షాలు కురుస్తుండడంతోనూ నష్టపో తున్నారు. ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభించిన అధికారులు కనీసం ధాన్యం కొనుగోళ్లనైనా వేగంగా పూర్తి చేయలేదు. గోనె సంచుల కొరత, వర్షాలకు ధాన్యం తడిసిందని, తేమ ఉందని జాప్యం చేశారు. తీరా కాంటా వేశాక లారీలను మిల్లర్లు దించుకోకుండా కాలయాపన చేశారు. కల్లాల్లో తూకం వేసిన బస్తాల కుప్పలు పేరుకుపో యాయి. మిల్లుల వల్ల వందలకొద్ది లారీల ధాన్యం లోడు నిలిచిపోయాయి. దీంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియంతా నత్తనడకన సాగింది. జూన్ రెండో వారంలోకి వచ్చినా ఇప్పటికీ యాసంగీ ధాన్యం 30 శాతానికిపైనే కల్లాల్లో మూలుగుతోంది.

> వడ్ల కొనుగోళ్లు వొడవట్లేదు. వానాకాలం షురూ అయినా యాసంగీ ధాన్యం అమ్మకాలు పూర్తవ్వలేదు. కల్లాల్లో ధాన్యపు రాసులు తల్లాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మే చివరి నాటికే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాల్సి ఉన్నా జూన్ రెండో వారంలో కూడా ఇంకా కొనుగోళ్లు కొనసాగుతునే ఉన్నాయి. ఒక పక్క ఖరీఫ్ పంటల సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు మరో పక్క కల్లాల్లో పోసిన ధాన్యం కాంటా కాకపోవడంతో కావలి కాసే పనిలోనూ ఉంటున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఆలస్యంగా ప్రారంభించినందున్నే ఇంకా కల్లాల్లో ధాన్యం కాకుండా ఉండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



30 శాతం ధాన్యం కల్లాల్లోనే..

నిర్దేశించిన లక్ష్యంలో ఇంకా 30 శాతం వరకు ధాన్యం కొనుగోళ్లు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి రావాల్సిన డబ్బులు రైతుల చేతికందలేదు. సంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగీ సీజన్‌లో 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇతర అవసరాలకు పోను మార్కెటకు వచ్చే ధాన్యంలో 2.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు లక్షా 10 వేలా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా కల్లాలు, ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం 40 శాతం వరకు కొనుగోలు చేయాల్సి ఉంది. అధికారులు మాత్రం ఇంకా ఐకేపీ కేంద్రాల నుంచి 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మెదక్ జిల్లాలో 2.24 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. పండిన ధాన్యంలో ప్రభుత్వ సంస్థల ద్వారా 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2 ల క్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇంకా సగం ధాన్యం వరకు కళ్లాల్లోనే మగ్గుతుంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల కొనుగోళ్లు సవ్యంగా సాగలేదు. అధిక తూకం పేరుతో దోపిడికి పాల్పడిన మిల్లర్లు ఐకేపీ కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లోడులను దించుకోలేదు. రోజుల తరబడిగా లారీలను మిల్లుల బయట నిలబెట్టారు. లారీకి 18 క్వింటాళ్ల వరకు తరుగు తీసేందుకు అంగీకరిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని హుకుం జారీ చేసిన పరిస్థితి మెదక్‌లో కనిపించింది. సివిల్ సప్లయి అధికారులు మిల్లర్లను కంట్రోల్ చేసి రైతుల ధాన్యాన్ని సకాలంలో తూకం దోపిడి లేకుండా కొనుగోలు చేయలేకపోయారు. మిల్లర్లు తమకు నచ్చినట్లుగా చేసుకుంటూ పోయినా పెద్దగా చర్యలు తీసుకోలేదు. సిద్ధిపేట జిల్లాలో కూడా ఇంకా కొన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల చేయాల్సి ఉంది.

నైరుతీ ప్రభావం...కురుస్తున్న వర్షాలు

నైరుతీ రుతుపవనాలు కేరళను తాకిన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఈదురు గాలులు వీస్తున్నాయి. ఇప్పటికే అకాల వర్షాల వల్ల ధాన్యం రాలిపోయి, తడిసి రంగుమారి, మొలకొచ్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే ధాన్యం రాసులు కళ్లాల్లోనే ఉండడంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మళ్లీ నష్టపోతున్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం కూడా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు చోట్ల వర్షం పడింది. ఈదురు గాలులు వీచాయి. రైతులు ధాన్యం రాసుల వద్ద మార్కెట్లలో పడిగాపులు కాస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున రెండో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం పైకమందలే

ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కాంటా వేసి నెల రోజులైనా తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని రైతులు బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. శివంపేటకు చెందిన రైతు వెంకటేశ్వర్లు ధాన్యం అమ్మి 15 రోజులు దాటినా తనకు డబ్బులు పడలేదు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.108 కోట్ల వరకు జమచేశారు. ఇంకా వంద కోట్లపైనే చెల్లించాల్సి ఉంది. మెదక్‌లోనూ కొనుగోలు చేసిన 2 లక్షల మెట్రిక్ టన్నుల్లో సగం మందికి కూడా డబ్బులు వేయలేదు. రూ.120 కోట్ల వరకు వేశారు. ఖరీఫ్ పంటల సాగు పనులు షురూ అయ్యాయి. విత్తనాలు, ఎరువులు ముందే తెచ్చుకునేందుకు పెట్టుబడి లేక అప్పులు చేస్తున్నారు. యాసంగీ దున్నిన డబ్బులివ్వకపోవడంతో ట్రాక్టర్లు దుక్కలు దున్నట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 8వ రోజు సంక్షేమ సంబురాలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపా ల్‌రెడ్డితో కలసి మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి మున్సిపాల్టీకి చెందిన అర్హులైన వారికి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో కౌన్సిలర్లు దశరథ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి

నవతెలంగాణ-కొమురవెల్లి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) కార్యకర్తలు నిరంతరం పోరాడాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) పార్టీ కొమురవెల్లి మండల కమిటీ సమావేశం రామ్ సాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు మతోన్మాదం కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై పార్టీ నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ కంపెనీలకు భజన చేస్తున్నాడని అన్నారు దేశంలో కులాల మతాల మధ్య విభజన తీసుకొస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు . గతఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ అయినా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కొమురవెల్లి గ్రామనికి తప్ప మిగిలిన గ్రామాలకు ఇండ్లు ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాడని మండలంలోని 11 గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని వారికి ప్రభుత్వం ప్రకటించిన మూడు లక్షల రూపాయలు ఇచ్చి వెంటనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వడగండ్ల వాన పడి నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతుల ఖాతాల లో డబ్బులు జమకాలేదని వాటిని వెంటనే విడుదల చేయాలని లక్ష రూపాయల వరకు బ్యాంకు రుణాలు వెంటనే మాఫీ చేయాలని ధరణి పోర్టల్ లో ఉన్న లోపాలను తొలగించి సన్నా చిన్న కారు రైతులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఎం పార్టీ కార్యకర్తలు ముందుండి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, అయినా పూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, అత్తిని శారద, తేలు ఇస్తారి, బక్కిలి బాలకిషన్, ఉల్లం పల్లి సాయిలు, దాసరి చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

నీటిని నింపకుండా చెరువుల పండుగ చేయడం సిగ్గుచేటు

నవతెలంగాణ-సిద్ది పేట



జిల్లాలో ఉన్నా రంగనాయక సాగర్, అన్నపూర్ణ సాగర్లను ఆగ మేఘాల మీద ప్రారంభించి.. చెరువులకు, కుంటలకు కాలువలను తవ్వకుండానే, నీటిని నింపకుండా చెరువుల పండుగలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రెండు ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, వాటిద్వారా చెరువు, కుంటలకు నీటిని విడుదల చేసేలా కాలువలు లేకపోవడంతో ప్రాజెక్టులు వున్నా ఎలాంటి ఫలితం లేదన్నారు. ప్రాజెక్టు పూర్తై 5 ఏండ్లు అవుతున్నప్పటికి సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని చెరువు, కుంటలకు నీరివ్వకపోడంతో రైతులపై హరీశ్‌రావుకు ఎంత ప్రేముందో అర్థమైతుందన్నారు. ముమ్మాటికీ మంత్రి హరీశ్‌రావు రైతుల వ్యతిరేకమన్నారు. నీరు లేక వేసిన పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉంటే ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకులు ఎందుకు పట్టించుకోలేదో ప్రజలు నిలదీయాలని కోరారు. చెరువుల పండుగ పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేస్తుం న్నారని మండిపడ్డారు. కేవలం ప్రజావ్యతిరేకతను పక్కతోవ పట్టించేందుకే ఈ దావత్ లా డ్రామా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసం మహేందర్ యాదవ్, ఉడుత జయంత్, గణేష్, సంధబోయిన పర్శరాములు, మహేందర్, వేణు కొమురయ్య, బాలమళ్ళు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదంతో రైతు మృతి



నవతెలంగాణ-వర్గల్

కరెంటు తీగే యమపాశమై మెడకు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని దండుపల్లి గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుపల్లి గ్రామానికి చెందిన టెంకంపేట నర్సింలు (55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి లాగే తన పొలం వద్ద ఉన్న బోరు వేయడానికి వెళ్ళాడు. స్టాటర్ డబ్బాలో విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడిక్కడే మృతి చెందారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

నవతెలంగాణ-కొండాపూర్



గతంలో కురిసిన వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు ఎట్టకేలకు విద్యుత్ అధికారులు మరమ్మతలు చేపట్టారు. 'నేలకొరిగిన స్తంభాలు.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికన శుక్రవారం నవతెలంగాణ పత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. నేలకొరిగిన 10 విద్యుత్ స్తంభాలను మరమ్మత్తులు చేసి సమస్యను పరిష్కరించారు. రైతులు సమస్య పరిష్కారం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవతెలంగాణ పత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-తొగుట

132 కెవి మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం అవుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. తొగుట మండలంలోని రైతులకు, ప్రజలకు, వివిధ కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ అంతరాయం కలు గనుందన్నారు. శనివారం తుక్కాపూర్ 132 కె.విలో మరమ త్తులు కారణంగా 33/11కె.వి మెట్టు, గుడికందుల, తడకపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల మెట్టు, బండారుపల్లి, ఘనపూర్, గుడికందుల, లింగంపేట్, తడకపల్లి గ్రామాలకు ఉదయం 07:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అంతరా యనికి రైతులు, ప్రజలు, కార్పొరేట్ సంస్థలు సహకరించగలరని కోరుతున్నామన్నారు.

దేశంలో తెలంగాణది సంక్షేమ స్వర్ణయుగం

- కరువుకు నెలవైన హుస్నాబాద్ నేడు సస్యశ్యామలం
- రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

దేశంలో సంక్షేమ పథకాల పేరిట ప్రతీ సంవత్సరం పేదల సంక్షేమం కోసం రూ.50,000 కోట్లు ఖర్చు పెడుతున్న తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాల అమలులో స్వర్ణ యుగమని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఒకప్పుడు కరువుకు నెలవైన హుస్నాబాద్ ప్రాజెక్టుల నిర్మాణాలతో సస్య శ్యామలంగా మారిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందని, రేపో, ఎల్లుండో కటక ఒత్తడే నీళ్ళు పోసుడేనన్నారు. అన్ని పండుగలు కలిసొస్తే ఎంత గొప్పగా ఉంటదో అంతటి పండుగను మనం గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవం రోజు జరుపుకుందామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజ్ ఇస్తున్నామని, 185 మంది ఎస్టీ సోదర నిర్వాసితులకు ఒక్కరికి 8 లక్షల పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. పరిహారంతో పాటు ఇంటి జాగాని కూడా అందిస్తున్నామన్నారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో నిర్వాసితులకు ఇంత పెద్ద ఎత్తున ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం 44 లక్షల మందికి రూ.2,000 పెన్షన్ ఇస్తున్న ఘనత మాదన్నారు. మహారాష్ట్ర నుంచి 25 మంది సర్పంచులు సిద్దిపేటకు చూడ్డానికి వచ్చిరని, మహారాష్ట్రలో చెరువులను పట్టించుకునే నాధుడే లేడన్నారు. తాగడానికి నీళ్ళు వారానికి ఒక రోజు ఇచ్చే పరిస్థితి మహారాష్ట్ర ప్రభు త్వానిదన్నారు. రైతులకు దొంగరాత్రి కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కెసిఆర్ కిట్టు, వ్యవసాయానికి 24 గంటల కరెంటు లేదు, 2000 పెన్షన్ రైతులకు రైతుబంధు లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆసరా పెన్షన్ల కోసం 53 వేల కోట్లు, రైతుబంధు పథకం కింద రూ.65వేల కోట్లను రైతులకు నేరుగా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రూ.65 వేల కోట్లు ఖర్చు చేసి రైతులకు ఉచిత కరెంట్ అందించిన ఘనత కేసిఆర్ దేన్నారు. ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలు సహాయం, రైతుబంధు రైతు బీమా ఇచ్చి రైతులకు రైతు బాంధవుడిగా కేసీఆర్ మారిందన్నారు. ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్‌ని, సతీష్ బాబును మీరందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, ఎమ్మెల్యే సతీష్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకన్న, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని, ఎంపీపీలు లకావత్ మానస సుభాష్ మాలోతు లక్ష్మీ బిల్లు నాయక్, జెడ్పిటిసి భూక్య మంగా తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- నియోజకవర్గ పరిధిలోని 30 మంది దివ్యాంగులకు ట్రై స్కూటీలు పంపిణీ
- త్వరలోనే వికలాంగులకు సొంత ఖర్చులతో ఉచిత బస్సు పాసులు పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేట

దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్ధిపేట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 30 మంది దివ్యాంగులకు ట్రై స్కూటీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపాయి ఖర్చు లేకుండా దివ్యాంగులకు రూ.1,04,000 విలువైన ట్రై స్కూటీలను అందిస్తున్నదన్నారు. చిరు వ్యాపారం చేసుకునే దివ్యాంగుల బతుకుదెరువు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణాలు అందిసన్నదని మంత్రి వెల్లడించారు. సీఎం కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగులకు రూ.3 వేలు పింఛన్లు ప్రతినెలా అందిస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుగా ప్రగల్భాలు చెబుతున్న బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులకు కేవలం రూ.500, రూ.600 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. వికలాంగులను స్వయం ఉపాధి కోసం లక్ష రూపాయలు రుణాలను, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న వారికి లక్ష రూపాయలు ,కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సీఎం కేసీఆర్ వికలాంగుల సంక్షేమానికి పని చేస్తున్నారని, కొంత మంది సోషల్ మీడియాలో నిన్న మొన్న వచ్చి అవాక్కులు, చెవాక్కులు మాట్లాడుతున్నారని వారికి మీరంతా చెంప మీద కొట్టేలా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బట్ట కాల్చి మీదేసే విధంగా ఇష్టారీతిగా గోబెల్స్ ప్రచారాన్ని చేస్తున్న వారిని ప్రజలే తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందుతున్న వారు కేసీఆర్ కు అండగా ఉండి ఆశీర్వదించాలన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వారి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ.. సద్దితిన్న రేవు తలవాలని, సాయం చేసిన వారిని గుర్తుంచుకోవాలన్నారు.



సొంత ఖర్చులతో ఉచిత బస్సు పాసులు పంపిణీ..

త్వరలోనే వికలాంగులకు సొంత ఖర్చులతో ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇంద కోసం రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, సంబంధిత వికలాంగుల ధవీకరణ పత్రాలు క్యాంపు కార్యాలయంలోని ఓఎస్డీ బాలరాజు, పీఏ రాముకు అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సదవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సిద్దిపేటలో డైనోసార్ పార్క్ ప్రారంభం..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. కోమటి చెరువులో నెలాఖరులోగా డైనోసార్ పార్క్‌ను ప్రారంభించకపోతున్నామని, చెత్తను మూడు రకాలుగా వేరుగా సేకరించిన మూలంగా సిద్దిపేట పట్టణంలో ఈగలు, దోమలు, పందులు లేకుండా చేశామని, స్వచ్ఛ సిద్దిపేట సహకరించిన అక్కా, చెల్లెలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా 60 మంది బీసీలకు ఒక లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం, గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ, 30 వేలు మరియు 50 వేల చొప్పున 27 మంది వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం, 20 లక్షల రూపాయల విలువైన అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇద్దరికీ, లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా ఎనిమిది మందికి మ్యారేజ్, యాక్సిడెంట్ బెనిఫిట్స్, సెట్విన్ ద్వారా 40 మందికి కుట్టు మిషన్లు, కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలకు కళ్యాణ లక్ష్మితో కలిపి 2 లక్షలు 50 వేల రూపాయల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా రాధాకష్ణ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజ నర్సు, రాష్ట్ర మెడికల్ బోర్డు మెంబర్ పాల సాయిరాం, మునిసిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఐటీ హబ్

నవతెలంగాణ-కొండపాక

సిద్దిపేట జిల్లా స్థాయి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు మండల పరిధిలోని దుద్దడ గ్రామ శివారులో ఐటి హబ్ ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మండల పరిధిలోని దుద్దడ గ్రామం శివారులో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను శుక్రవారం ఉదయం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవిలతో కలిసి ఐటీ టవరులోని ప్రతీ ఫ్లోర్ కలియ తిరుగుతూ సందర్శించి జిల్లా కలెక్టర్, టీఎస్ఐఐసీ అధికారులతో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రి హరీష్ రావు సమీక్ష జరిపారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఐటీ హబ్ భవనాన్ని ఈ నెల జూన్ 15వ తేదీన రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో ప్రత్యక్షంగా 750 మంది స్థానిక యువతకు, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ జూన్ నెల 13వ తేదీన సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ హాల్ లో మెగా జాబ్ మేళా నిర్వహిసున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ మెగా జాబ్ మేళాలో 11 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు ఇవ్వనున్నాయని, ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీ హబ్‌లో టాస్క్ ఆధ్వర్యంలో ప్రతీ బ్యాచ్ లో 150 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, ప్రతీ 45 రోజులకు ఒక బ్యాచ్ ఉంటుందన్నారు.



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మునిపల్లి

తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సంక్షేమ సంబరాలలో భాగంగా మునిపల్లి మండలానికి సంబంధించి కళ్యాణ లక్ష్మి 136 గురికి చెక్కులు, షాదీ ముబారక్ 41గురికి చెక్కులు, మొత్తం మండలానికి 177 మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాన్ని అందుకున్నారు. చెక్కులు అందుకున్న వారందరూ తమ కూతుర్లకు మేనమామ కానుకగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్న ఈ అమూల్యమైన కానుకకు మేము రుణపడి ఉంటామని.. అనంతరం సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటా సంక్షేమం

- రాష్ట్రంలో కులవృత్తులకు పెద్దపీట
- బీసీ కుల వృత్తులకు లక్ష రూపాయల సాయం చారిత్రాత్మక నిర్ణయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఘనంగా సంక్షేమ సంబురాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రతీ ఇంటా సంక్షేమం, గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 8వ రోజైన శుక్రవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామ చౌరస్తాలో గల ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గస్థాయి సంక్షేమ సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలన్న ధృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతతో లబ్దిదారులను ఎంపిక చేసి సకాలంలో డబ్బులు అందిస్తున్నామన్నారు. ప్రధానంగా నిరుపేదల ఆడపిల్లల వివాహం భారం కాకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ప్రవేశపెట్టి లక్ష 116 రూపాయలు ప్రభుత్వం అందిస్తుం దన్నారు. ఈ పథకం మూలంగా లక్షలాదిమంది ఆడపిల్లల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. వీటితోపాటు ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, వికలాంగులకు రూ.2000 నుంచి 3000 వరకు పెన్షన్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. వీటితోపాటు దేశంలోనే మొదటిసారిగా దళితులు ఆర్థిక అభ్యున్నతి కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ పథకం దళితుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. బీసీ వర్గాలలోని కులవృత్తుల సంక్షేమం కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బ్యాంకుల లింకేజీ లేకుండా నేరుగా లబ్దిదారు ఖాతాలోకి జమ చేసి, వారి ఆర్థిక పరిపుష్టికి బాటలు వేస్తోందన్నారు. ప్రతి పేదవాడి సంక్షేమా నికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ముగ్గురు లబ్దిదారులకు చెక్కులు అందజేసి బీసీ కుల వృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారులకు చెక్కులను అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రభాకర్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవానందం, సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు రోజా బాల్‌రెడ్డి, లలిత సోమిరెడ్డి, కార్పొరేటర్లు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కమిటీల చైర్మన్లు, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లబ్దిదారులు పాల్గొన్నారు.



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-వట్‌పల్లి

జొన్న పంట పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని.. దళారులకు విక్రయించి నష్టపోవద్దని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండలంలోని దేవునూరు రైతు వేదిక భవనంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కాంక్షించి జొన్న పంటకు గిట్టుబాటు ధర ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు నర్సింలు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అశోక్ గౌడ్. వరం ఛైర్మెన్ వీరారెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ చౌహన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సవిత, మౌనిక, గ్రామ కార్యదర్శి విజయ తదితరులు పాల్గొన్నారు.

కొడెకల్ గ్రామంలో లేగదూడల ప్రదర్శన



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అందోల్ మండలం కొడెకల్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భాదారణ ద్వారా జన్మించిన లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపాలమిత్ర సూపర్ వైజర్ అర్జునయ్య పాల్గొని మాట్లాడుతూ.. లేగాదూడలు జన్మించిన 7వ రోజు మరియు 15వ రోజు నట్టల నివారణ మందులు తాగించడం వలన దూడలు ఆరోగ్యాంగా ఉండడమే కాకుండా రైతులకు నష్టం జరగకుండా ఉంటుందన్నారు. నేటి దూడలే రేపటి పాడి పశువలని వారు వివరించారు. కావున రైతులందరు మేలుజాతి దూడల కోసం వారి వారి పశువులకు కృత్రిమ దర్భాదారణ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, అంజిరెడ్డి, గోపాలమిత్రలు కె.ఆర్.ప్రభు, నాగరాజు, రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణకు ఐఎన్ఎస్ఏ విజిటింగ్ ఫెలోషిప్



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణ కుమ్మరి భారత జాతీయ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్ కు ఎంపిక య్యారు. ఈ విషయాన్ని ఆ విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఐఎన్ఎస్ఏ మార్గదర్శకాల ప్రకారం, ఫెలోషిప్ అనేది అధునాతన పరిశోధనలు, లేదా భారతీయ పరిశోధనా సంస్థలు/ప్రయోగశాలల్లో ప్రత్యేక శిక్షణ పొందడం కోసం ఉద్దేశించినదన్నారు. ఈ అవార్డు పొందిన వ్యక్తి మనదేశంలోని ఏదేని ప్రయోగశాల లేదా పరిశోధనా సంస్థలో కనీసం ఒకనెల నుంచి గరిష్టంగా ఆరు నెలల వరకు గడపవలసి ఉంటుందని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ప్రయాణ ఖర్చులతో పాటు నెలకు 30 వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తారన్నారు.ఐఎన్ఎస్ఏ విజిటింగ్ ఫెలోషిప్ పొందిన డాక్టర్ కృష్ణను సహ అధ్యాపకులు పలువురు అభినందించారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్ పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-సంగారెడ్డి

పాలిటెక్నిక్ అడ్మిషన్ ప్రక్రియ మొదలు కానున్న సందర్భంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, తెలంగాణలోని అన్ని కళాశాలల, కోర్సుల గురించి తెలుసుకొనుట, ఆప్షన్ ఇచ్చుట, అలాట్మెంట్ మొదలైన విషయాల పైన నిపుణులైన ఆధ్యాపక బృందంతో సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 12, 13, 14వ తేదీల్లో అవహగాహన కల్పించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి పాలిసెట్-2023 క్వాలిఫై ఐన ప్రతీ విద్యార్థి ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటల నుండి 12 వరకు హాజరై సరైన అవగాహన పొంది మంచి కళాశాలలో సీటు పొందాలన్నారు. అదే విదంగా సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో గల కోర్సులు, వసతులు, ప్రయోగ శాలలు, హాస్టల్, బోదన పరికరములు, బోధన సిబ్బంది. బోధనేతర సిబ్బంది గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. జిల్లా సాంకేతిక విద్యా కళాశాలకు డిప్లొమా ఇన్ ఈసీఈ డిప్లొమా ఇన్ ఈఈఈ కోర్సులు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు 9505504210, ఈసీఈహెచ్ఓడి, డిజి మల్లికార్జున్-9440108552, ఈఈఈ హెచ్ఓడి, ఆనంద్ కుమార్ 949475106 ను సంప్రదించాలన్నారు.



లక్ష్మారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ డి.లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. శుక్రవారం డిఎల్ఆర్ మరణ వార్త విని ఎమ్మెల్యే మాణిక్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి గురయ్యారు. బీఆర్ఎస్ పార్టీలో ఎంతో కీలక నేత అయిన లక్ష్మారెడ్డి వికారాబాద్ జిల్లా శంకర్‌పల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై మృతి చెంది పడి ఉండడం తెలుసుకున్న ఎమ్మెల్యే. హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాతబస్తిలో నివాసం ఉంటున్న ఒరిస్సా వాసి గౌరంగ సుతార్ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం ఆకస్మికంగా సిలిండర్ పేలిన ఘటనలో గాయపడ్డాడు. అతని రెండు కాళ్లు కాలిపోవడంతో ప్రస్తుతం మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న టీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం బాధితుడికి భార్య మధుమితకి రూ.5000 ఆర్థిక సాయం చేశారు. ఇంకా ఏమైనా అవసరం పడితే తమను సంప్రదించాలని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు టీ. రవీందర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రాఘవేంద్ర రెడ్డి,రాజగోపాల్, బాల్ సింగ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-మునిపల్లి

హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి అక్రమ రవాణా చేస్తున్న 291 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద పౌరసరఫరాల శాఖ మ రియు పోలీసులు సంయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసు కున్నారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.3 లక్ష ల వరకు ఉంటుందని తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

నవతెలంగాణ-న్యాల్‌కల్

జహీరాబాద్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కే.మాణిక్‌రావు చేతుల మీదుగా లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం అందజేశారు. హద్నూర్ గ్రామంలో 5 మందికి చెక్కులు వచ్చినట్టు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్ తెలిపారు. న్యాల్‌కల్ మండలానికి 58 మందికి చెక్కులు వచ్చినట్టు న్యాల్‌కల్ మండల ఇన్చార్జ్ తహసిల్దార్ మునిరోద్దీన్ చెప్పారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, గిర్ధవర్ దుర్గయ్య, సర్పంచులు, కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న తెలంగాణ

- సంక్షేమ పథకాల అమల్లో దేశానికే తెలంగాణ ఆదర్శం
- రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శం అని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్ అన్నారు.శుక్రవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంక్షేమ సంబురాలు సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఆర్డీవో రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా చింతా ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శమన్నారు. ప్రపంచంలో ఇంత గొప్ప సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అది ముఖ్యమంత్రి కేసీఆర్ కె ఘనత అని అన్నారు. సర్వమతాలకు సమాన ప్రాధాన్యతినిస్తూ.. సబ్బండ వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నది రాష్ట్రం ఏదైనా ఈ దేశంలో ఉంది అంటే అది తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి 24 యూనిట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం 6 యూనిట్లు పంపిణీ చేశామని తెలిపారు. త్వరలోనే మిగతా వారికి కూడా అందిస్తామన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో నాడు 2014లో పింఛన్లు పొందే లబ్దిదారులు సంఖ్య 19,047 ఉంటే నేడు ఆసరా పెన్షన్ల సంఖ్యను ప్రభుత్వం 30,342 మందికి పెంచిందన్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రతి ఏటా రూ.18.10 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి 358 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. బీసీ వర్గాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.లక్ష రుణాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీ వైస్ చైర్ పర్సన్ లతా విజయేందర్ రెడ్డి, సంగారెడ్డి జడ్పీటీసీ సునీతా మనోహర్ గౌడ్, కంది జడ్పీటీసీ కొండల్ రెడ్డి, ఎంపీపీ సరళా పుల్లారెడ్డి, కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్, భాస్కర్ రెడ్డి, నందకిషోర్, నరసింహులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ బస్సు ఆఫీసర్‌గా కండక్టర్ శివశంకర్



నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జోగిపేట పట్టణానికి చెందిన ఊస శివశంకర్ విలేజ్ బస్సు ఆఫీసర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డి బస్ డిపోలో జరిగిన బస్సు ఆఫీసర్ల నియమాక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విలేజ్ బస్సు ఆఫీసర్లుగా నియామకమైన కండక్టర్లకు జడ్పీ చైర్ పర్సన్ నియామక పత్రాలు, డ్రెస్ కోడ్, ఐడెంటి కార్డులు అందజేశారు. ఇందులో భాగంగానే బస్సు ఆఫీసర్‌గా నియామక పత్రం అందుకున్న శివ శంకర్ మాట్లాడుతూ.. బస్సు ఆఫీసర్‌గా నియమించినందుకు ఆర్టీసీ ఆర్ఎంకు, డిపో మేనేజర్‌కు తోటి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బస్సు ఆఫీసర్ నియామకం పట్ల విధుల నిర్వహణలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం దైవదినం, డిపో మేనేజర్ ఉపేందర్ తదితరుల పాల్గొన్నారు.

పేదింటి పెద్ద కొడుకుగా కేసీఆర్

నవతెలంగాణ-జోగిపేట

పేదింటి పెద్ద కొడుకుగా సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌లు అన్నారు. శుక్రవారం అందోల్ నియోజకవర్గస్థాయి సంక్షేమ సంబురాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక లక్ష్మీ నరసింహ గార్డెన్లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్‌లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ్ కి నేత సీఎం కేసీఆర్ సహకారంతో రాష్ట్రంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా ముందుకు సాగుతున్నాయని, ఇవి దేశానికి ఆదర్శమన్నారు. సీఎం కేసీఆర్ విజన్‌తో పని చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కుల వృత్తులకు జీవనోపాధి కల్పించేందుకే లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల రూపంలో ఆదుకుంటున్నారన్నారు. అందోల్ నియోజకవర్గంలోని ఎనిమిది 9 మండలాలకు సంబంధించి 639 మందికి సంబంధించి రూ.7.10 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గొల్ల కురుమలు గొంగళ్ళను కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఎల్లయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, ఎంపీపీ బాలయ్య వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అందోల్ తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులుశ్రీధర్, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.



వివిధ శుభకార్యాల్లో పాల్గొన్న వై.నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల వివాహది శుభకార్యాల్లో టీపీసీసీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించి.. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బీదర్ జిల్లా (కర్ణాటక) కేంద్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సముదాయ భవన్‌లో శుక్రవారం జరిగిన న్యాల్‌కల్ మండలం కల్బెమల్ గ్రామం సుభాష్ వీరప్ప పాటిల్ కుమారుడి వివాహానికి, జహీరాబాద్ పట్టణంలోని పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన జహీరాబాద్ పట్టణం అల్లిపూర్ గ్రామం యం.అమృత్ కుమార్తె, మొగుడంపల్లి మండలం గోటిగార్‌పల్లి గ్రామం సంజీవ్ కుమారుడి వివాహానికి, మొగుడంపల్లి మండల కేంద్రంలోని ఆజాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కోహిర్ మండల జెడ్పీటీసీ రాందాస్ సోదరుని కుమార్తె వివాహానికి, ఝరాసంగం మండలం కుప్పానగర్ గ్రామంలో జరిగిన ఆర్.ప్రకాష్ సోదరుని వివాహానికి, జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరిగిన జహీరాబాద్ పట్టణం స్వర్ణకుమారి, సంజీవ్‌రావుల కుమారుని వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ యం.జైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ముల్తానీ, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి, సర్పంచ్ పాండురంగా రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మైనోద్దీన్, ఎంపీటీసీ జ్ఞానరత్నం, మాజీ సర్పంచ్ శంకర్, ప్రవీణ్ రెడ్డి, విఠల్‌గౌడ్, రాజు నాయక్, చెంగల్ జైపాల్, జగన్నాథ్ పాటిల్, చిన్న, శ్రీకాంత్, దేవదాస్, అప్సర్ దిల్దార్ తదితరులు హాజరయ్యారు.

వావిలాలలో ఎంపీపీ, సర్పంచ్ సహపంక్తి భోజనాలు



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిన్నారం మండలం వావిలాల గ్రామంలో జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్, సర్పంచ్ సుశాంతి నవనీత రెడ్డి,ఉప సర్పంచ్ నవనీత రెడ్డి, ఎంపీడీవో రాములు బృందం ప్రత్యేకంగా సహపంక్తి భోజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుల పండుగ అవశ్యకత, పల్లెల పచ్చని వాతావరణం, తెలంగాణ సాంప్రదాయం, బతుకమ్మలు ఇతరత్రా అనేక అంశాలను గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, స్థానిక మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై ప్రత్యేక పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

యాసిడ్ తాగి మహిళా ఆత్మహత్య

- అత్తింటి వేధింపులతోనే అఘాయిత్యం
- మృతురాలు కుటుంబీకుల ఆరోపణ

నవతెలంగాణ-పటాన్‌చెరు

మనస్తాపంతో యాసిడ్ తాగి ఓ మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన సరిత (33)కు, మండలంలోని ఇస్నాపూర్ గ్రామానికి చెందిన కోటేశ్వర్‌తో 9 ఏండ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం క్రితం నుంచి కుటుంబంలో అదనపు కట్నం కోసం తరచూ గొడవలు జరుగుతుండేది. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం గొడవ జరగ్గా సాయంత్రం 6 గంటల సమయంలో సరిత ఇంట్లోనే యాసిడ్ తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ్నుంచి మెరుగైన చికిత్స కోసం బీరంగూడలోని పనేషియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి 10 గంటలకు మృతి చెందింది. అదనం కట్నం కోసం భర్త, అత్త, తోటి కోడలు వేధింపులతోనే సరిత మృతి చెందిందని.. మృతురాలి తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొల్లూరులో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- బీరప్ప, మల్లికార్జున స్వామి, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా మంజూరు అయిన కొల్లూరు పోలీస్ స్టేషన్‌ను నేడు(శనివారం) రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్టు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఉస్మాన్ నగర్ పరిధిలోని మున్సిపల్ వార్డు కార్యాలయ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో మెరుగైన శాంతిభద్రతలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నూతన పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్ భవనంతో పాటు తెల్లాపూర్ లో నూతనంగా నిర్మించ తలపెట్టిన బీరప్ప దేవాలయం, మల్లికార్జున స్వామి దేవాలయం, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు మంత్రి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, మియాపూర్ ఏసిపి నరసింహారావు, సిఐ సంజయ్, స్థానిక కౌన్సిలర్ చిట్టి ఉమేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి అభినందనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సంక్షేమ సంబరాలను జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గొల్ల కురుమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కులవృత్తుల వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులను పైలెట్ ప్రాజెక్టుగా ముగ్గురికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గానికి చెందిన కులవృత్తుల వారు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష రూపాయల ఆర్థిక సాయం పొందాలన్నారు. ఆన్లైన్లో అప్లై చేసుకున్న వారికి వచ్చే నెల 5వ తారీఖు నుంచి విడుతల వారీగా చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొల్ల కురుమలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రెండో విడత గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. అటు పిమ్మల కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డిఓ జయదేవ్, ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గుండప్ప, బీఆం ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహివుద్దీన్, ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మెంబర్ బంటు రామకృష్ణ, సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు రవి కిరణ్, సురేష్, సీనియర్ నాయకులు రాజ్ కుమార్, ప్రవీణ్, వెంకటేశం, ఇజ్రాయేల్ బాబీ, అగ్రికల్చర్ ఎడి బిక్షపతి, పశు సంరక్షక శాఖ అధికారులు , ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంక్షేమానికి సిబ్బంది కృషి చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ఆర్టీసీ సంస్థ సంక్షేమానికి సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఎంవీఐ జయప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జహిరాబాద్ డిపోలో విలేజ్ బస్ ఆఫిసర్స్ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం విలేజ్ బస్ ఆఫిసర్స్ అందరికి ఉద్యోగ కరదీపిక, ఇతర సామాగ్రి అందచేశారు. జహిరాబాద్ డిపోలో పని చేస్తూ వివిధ గ్రామాల్లో నివాసముంటున్న వారిని ఆయా గ్రామాల్లో విలేజ్ బస్ ఆఫిసర్స్‌గా నియమించారు. వారు ఆ గ్రామంలో ప్రజలకు ఆర్టీసీకి అనుసంధాన కర్తలుగా వుండి ప్రజలకు ఆర్టీసీ సేవలు అందెలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రజనీ కృష్ణ, ట్రాఫిక్ సూపర్వైజర్లు శివరామ్, చంద్రకళ, 20 మంది విలేజ్ బస్ ఆఫిసర్స్ పాల్గొన్నారు.

5వ సారి రక్తదానం..



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మున్సిపాల్టీలో విధులు నిర్వహిస్తున్న నాగరాజ్ యాదవ్ 5వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. సంగారెడ్డికి చెందిన రాములు అనారోగ్యంతో ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా అతనికి అర్జెంటుగా 'బి' పాజిటివ్ రక్తం అవసరం కావడంతో.. బాధితుడి కుటుంబ సభ్యులు సంగారెడ్డి బ్లడ్ డోనార్స్ క్లబ్ నిర్వాహకుడు మహేష్ యాదవ్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే నాగరాజ్ యాదవ్‌కి ఫోన్ చేసి రక్త దానం చేయాలని.. కోరగా వెంటనే స్పందించిన నాగరాజ్ ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కి చేరుకొని బి పాజిటివ్ రక్త దానం చేశారు. ఈ సందర్భంగా నాగరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. రక్త దానం చేయడం వల్ల కొత్త రక్తంతో మరింత ఉత్సాహంగా ఆరోగ్యంగా ఉంటారన్నాడు. ఈ సందర్భంగా రక్త దాత నాగరాజ్ యాదవ్‌కు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, బంగారు కృష్ణ మెహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి కాటా సాయం



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని ఊట్ల గ్రామపంచాయతీ పరిధి దాదిగూడెం గ్రామానికి చెందిన వడ్డే చంద్రయ్య-లలిత కుమార్తె మౌనిక వివాహానికి పటాన్చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు సదరు సహాయాన్ని జిన్నారం మండల ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్ బృందం స్వయంగా పెళ్లి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఊట్ల ఉపసర్పంచ్ జింకల రవి, పట్లోళ్ల మహేందర్ రెడ్డి, వీరంగారి నర్సింగరావు, గంగు భాస్కర్, గంగురాజు, వీరంగారి మహేష్, గంగు శ్రీనివాస్, గంగు వెంకటేష్,దాది గణేష్,శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిముందున్న కారు అద్దాలు ధ్వంసం



నవతెలంగాణ-సంగారెడ్డి

మండల పరిధిలోని కులబ్‌గూరు గ్రామ శివారులో గల టీజేఆర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఇండ్ల ముందు పెట్టుకున్న కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు కాలనీవాసులు తెలిపారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిని కాలనీవాసులు కోరారు.



గంగారంలో పోస్ట్ ఆఫీస్ ప్రారంభం

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గంగారం గ్రామంలో నూతనంగా మంజూరైన బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌ను పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ఎస్‌విఎల్ఎన్ రావు గ్రామ ప్రజలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ.. గతంలో పక్క గ్రామానికి వెళ్లి గ్రామీణ ఉపాధి హామీ డబ్బులు తెచ్చుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతుండేవారన్నారు. అయితే ప్రస్తుతం గ్రామంలోనే పోస్ట్ ఆఫీస్ మంజూరు కావడం హర్షణీయయమన్నారు. ఈ సందర్భంగా ప్రజల తరపున పోస్టల్ శాఖ వారికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతయ్య, మాలిస్ నరసింహారెడ్డి, వార్డు మెంబర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

BEFORE THE MOTORACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XXVI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
M.V.O.P. NO.729 OF 2021

BETWEEN
Smt. Chittar Yadamma & others - Petitioners
AND
Karee Divya & others ...Respondents

2. T Sadanandam S/o Balayya, aged about 52 years, Occ: Driver of the Crime Vehicle Activa bearing No. TS 08 ET 1667 R/o H.No. 7-69, Sitarampally, Wargal, Medak District, T.S.

Whereas the above named Petitioners filed Petition claiming compensation against the Respondents and the case is posted for your appearance and counter as Respondent No. 2 therefore you are hereby directed to appear before the Hon'ble Court on 20-06-2023 at 10:30 A.M. failing which the case will be heard and decided as perlaw.

// BY ORDER OF THE COURT//
G.GOPAL REDDY
KRAJARAO, Advocates
202, Rahmatha Complex, Ameerpet, "X" Road, Hyderabad



సామాజిక సేవే కేఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్ : రోడ్డు ప్రమాదాల భారీ నుంచి ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ రక్షిస్తోందని, రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ని తప్పనిసరి ధరించి ప్రయాణం కొనసాగించాలని కేఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంభీర్పూర్ గ్రామంలో కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు, యువతకు (సుమారు 300 మందికి) ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవే తన లక్ష్యంగా చేసుకుని దుబ్బాక మండలంలో కేఆర్ఆర్ ఫౌండేషన్ స్థాపించామన్నారు. అందులో భాగంగానే ప్రజలకు సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు నేడు మండల వ్యాప్తంగా యువతకు ద్విచక్ర వాహదారులందరికీ ఉచితంగా హెల్మెట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ప్రయాణికుడు బాధ్యతాయుతంగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వారి ప్రాణాలను రక్షించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల శ్రీనివాస్, గంభీర్పూర్ గ్రామ సర్పంచ్ కరికే భాస్కర్, రఘోత్తంపల్లి గ్రామ సర్పంచ్ రెడ్డి దేవిరెడ్డి, కేఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తొగుట అనిల్, పలువురు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు



నవతెలంగాణ-గజ్వేల్ : తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం మక్తమాసం పల్లి గ్రామంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం ముఖ్యంగా కంటి సమస్యలు ఎదుర్కొంటున్న పేదల కోసం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆర్థికంగా లేకపోవడంతో అనేకమంది చూపు కోల్పోతున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ మొదటి విడతగా గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దేశంలోనే ఒక గుర్తింపు వచ్చిందన్నారు. రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలతో బస్టాండ్ నిర్మాణ పనులకు బ్రేక్

- బీఆర్ఎస్ గ్రూపు రాజకీయాలతో గ్రామాభివృద్ధికి ఆటంకం
- వెంటనే బస్టాండు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తుల వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

దాదాపు 35 సంవత్సరాల నుంచి నిజాంపేట బస్టాండ్ కల నెరవేరడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్యనే మైనంపల్లి హనుమంతరావు ట్రస్టు ద్వారా ఆధునిక సౌకర్యాలతో అనగా ఏసి, మరుగుదొడ్లతో కూడిన బస్సు షెల్టర్ కట్టిస్తామని మైనంపల్లి రోహిత్ రావ్ తెలిపారు. బస్ షెల్టర్ వద్దు బస్టాండు కావాలని పద్మ దేవేందర్ రెడ్డి వర్గం పట్టుబట్టి వారి ప్రతిపాదనలను తిరస్కరించారు. పిల్లర్స్ వేసి బస్టాండ్ మేమే కట్టిస్తామని పద్మాదేవేందర్ రెడ్డి వర్గం తెలపడంతో మైనంపల్లి వర్గం సరే అని సర్దుకు పోయారు. దాదాపుగా రెండు నెలల క్రితం బస్టాండ్ కోసం పద్మాదేవేందర్ రెడ్డి వర్గం పిల్లర్స్ తీసి బస్టాండ్ కట్టిస్తామని ఇసుక, కంకర, స్టీలు, తేవడం కూడా జరిగింది , గుంతలు కూడా తవ్వడం జరిగింది. ఎందుకో ఏమో పనులు మాత్రం జరగడం లేదు. ఒక పక్క ఎండలు తీవ్రంగా ఉండడం మరో పక్క వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేయడం కూడా జరిగింది. సిసి రోడ్డు పనులు జరగడం లేదు ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే ఉన్నదనే చందంగా తయారైంది నిజాంపేట మండల కేంద్రం పరిస్థితి. మైనంపల్లి రోహిత్ రావు బస్ షెల్టర్ కట్టిస్తానని అన్నప్పటికీ వారిని కట్టనివ్వలేదు. పద్మా దేవేందర్ రెడ్డి వర్గం బస్టాండ్ కట్టడం లేదు. వీరి వర్గ పోరు వలన నిజాంపేట అభివృద్ధి కుంటుపడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదిఏమైనప్పటికి నిజాంపేట మండల ప్రజల చిరకాల వాంఛ అయిన బస్టాండ్ కల నెరవేర్చేలా నాయకులు స్పందించాలని, వెంటనే నిజాంపేట బస్టాండ్ పనులను మొదలుపెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్టాండు, సీసీ రోడ్డు పనులు వెంటనే మొదలుపెట్టాలి



కన్నాపురం బాగా గౌడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

బస్టాండ్ కట్టిస్తామని దాదాపు రెండు నెలల క్రితం బస్టాండుకు భూమి పూజ చేశారు. పిల్లర్స్ కోసం గుంతలు తీసి కావలసిన మెటీరియల్ కూడా తేవడం జరిగింది. పనులు మాత్రం జరగడం లేదు. బస్టాండ్ లేక నిజాంపేట మండల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు విపరీతంగా కొట్టడంతో ప్రయాణికులు ఎక్కడ కూర్చోవాలో తెలియని పరిస్థితి. బస్టాండ్ కోసం దాతలు విరాళాలు ఇస్తామని ప్రకటించారు. దాతలు డబ్బులు ఇవ్వలేక పనులు జరగడం లేదా? ఎందుకోసం పనులు జరగడం లేదు. ఆగ మేఘాల మీద పనులు మొదలుపెట్టిన వారు ఇప్పుడు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. సీసీ రోడ్డు పనులకు కూడా దాదాపు రూ.35 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ వాటి పనులు కూడా జరగడం లేదు. ఇప్పటికైనా నాయకులు స్పందించి పనులు త్వరితగతిన మొదలు పెట్టాలి.

ధాన్యం పోయినా డబ్బులు పడతలేదు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- అప్పులోళ్లు, ఫైనాన్స్ వాళ్ళు తిరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- వానాకాలం వచ్చింది , విత్తనపు వడ్లు ఎట్లా తెచ్చుకుంటామో ఏమోనని రైతుల దిగాలు



నవతెలంగాణ-చిలిపిచెడ్

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం కాంట వేసి పంపి 20 నుంచి 25 రోజులవుతున్న ఇంతవరకు రైతుల ఖాతాలలో డబ్బులు జమ కాలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యమైతే పోయింది గాని డబ్బులొస్తాయనే ఆశలతో ఉన్న రైతన్నల ఆశలన్ని ఆడియశాలయ్యాయి. గ్రామాలలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు ప్రభుత్వమే కొనుగోలు చేసి, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తామని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. రైస్ మిల్లులకు మండలంలోని గ్రామాల నుంచి ముందు పోయిన లారీల డబ్బులు మాత్రమే కొంతమంది రైతుల ఖాతాలలో మాత్రమే జమయ్యాయని, మిగతా రైతులకు డబ్బులు జమ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలనమ్మి అప్పులు కట్టుకుందామని ఎంతో ఆశతో ఎదిరి చూస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. రోహిణి కార్తె వచ్చి, మృగశిరా దాటినాగాని విత్తనపు వడ్లు తెచ్చుకోకపోతిమి, అకౌంట్లలో డబ్బులు పడితే అన్ని సమస్యలు అయిపోవుగదా అని రైతన్నలు వాపోతున్నారు. ఇప్పటికయినా జిల్లా కలెక్టర్ స్పందించి ధాన్యం అమ్మిన రైతులకు వారి వారి అకౌంట్లలో డబ్బులు జమ చేసి అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

పార్ట్ టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వకర్త నిర్మల



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన, సాంఘిక, జంతు, వృక్ష, ఎకనామిక్స్, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, నర్స్, పి.ఇ.టి, లైబ్రేరియన్ బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వకర్త నిర్మల శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ , జి .ఎన్.ఎం , బి పిఈడ్, బి.ఎల్.ఐసి అర్హతలు కలిగి ఉండాలన్నారు. జూన్ 15న మిట్టపల్లి గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే డెమోకు హాజరు కావాలన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మెదక్ రీజియన్ ఈస్ట్ సిద్దిపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకల ప్రాంతీయ సమన్వాయాధికారి నిర్మల కోరారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీల భర్తీకి 2023 మార్చిలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెబ్ సైట్ లో రూ. 100 రుసుం చెల్లించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15ను దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల వారి తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి తల్లిదండ్రుల ఆదాయం రూ.2 లక్షలు ఉండాలన్నారు. ఈ ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాల వయస్సు నిండరాదన్నారు. విద్యార్థులు తమ ప్రవేశాల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజకీయాలలో మానవీయ కోణం కనుమరుగైనది

- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొపెసర్ కొదండరామ్





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

అమరుల త్యాగ ఫలితంగా ఎర్పడ్డ తెలంగాణలో బీఆర్ఎస్ విధానాల వల్ల రాజకీయాలలో మానవీయ కోణం లేకుండా చేశారని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కొదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్ మీదుగా వెళుతున్న ఆయనకు దళిత సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వుండాల్సిన రాజకీయ నాయకులు దళారులు గా మారారన్నారు. సామాజిక కార్యకర్తలతో ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు ఎన్నికల హమీలపై చర్చించారు. రైతులకు రుణ మాఫిపై ఇచ్చిన ఎన్నికల హమీని విస్మరించారన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అవస్థలు పాలవుతున్నారన్నారు. పంట నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు గోస పడుతుంటే ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో మభ్యపెడుతున్నారన్నారు. దళిత బంధు పథకంలో అవినీతి సాకుతో గత రెండు సంవత్సరాలుగా పథకం అమలు నిలిపివేశారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ వివరించారు. ప్రభుత్వాన్ని నిలదీయాలని కొదండరామ్‌ను శంకర్ కోరారు. బీసీలకు లక్ష ఆర్థిక సహాయం ఓట్ల కోసమేనన్నారు. టీజెఎస్ జిల్లా అధ్యక్షుడు నీరుడు స్వామిని దళిత సంఘాల తెలంగాణ జన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, యంఎస్పి రాష్ట్ర నాయకులు మైస రాములు, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, సీసీసీ జిల్లా కొ ఆర్డినేటర్ సూకురి ప్రవీణ్, డిజెఎస్ యువజన నేత స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొట్యాల మల్లన్న ఆశీస్సులతో పాడి పంటలు

నవతెలంగాణ-ములుగు : అఖిల భారత యాద వ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్, కార్యదర్శి పోచబోయిన శ్రీహరియాదవ్‌లు ములుగు మండల అధ్యక్షులు యంజాల ఐలయ్య యాదవులతో కొట్యాల మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడుతూ మల్లన్న ఆశీస్సులతో పాడి పంటలు పశు సంపద సల్లంగుండాలని స్వామి వారు ఎల్లవేళలా మనకు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో, పత్తి వెంకటేష్ యాదవ్, బొల్లు రాము యాదవ్, చీర్ల రఘువర్ధన్ యాదవ్, కాటుక నర్సింలు యాదవ్, కొత్త రామకృష్ణా రెడ్డి, సత్తి కృష్ణారెడ్డి, బాలవతి రాజు, వనం మల్లేష్ యాదవ్,శ్రీశైలం యాదవ్,సాలంద్రి మల్లేశం, యాదవ్ బాబు యాదవ్, పెద్దిరాజు, సత్యనారాయణ, హన్మయ్య, గణేష్,ముత్యాలు, శ్రీకాంత్, రమేష్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తొగుట : దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శుక్రవారం మండలంలో పర్యటించారు. గోవర్ధనగిరి గ్రామంలో తోయేటి కిష్టయ్య కుమార్తె వివాహ వేడుకలలో ఎమ్మెల్యే పాల్గొని రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ తోయేటి ఎల్లం ను పరామర్శించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఇరుకోటి రమేష్, మండల భైరయ్యలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు విభిషన్ రెడ్డి, నంట స్వామి రెడ్డి, పరమేష్, సురేష్ గౌడ్, యాదగిరి, నర్సింలు, అనిల్, గోపి, స్వామి, సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

సంక్షేమ పథకాలను అమలుపరచడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌లో సంక్షేమ పథకాల సంబరాల కార్యక్రమం నిర్వహించగా. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి. షాది ముబారక్. రైతుబంధు. రైతు బీమా. దళిత బంధు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమ పార్టీ అని అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కుల వృత్తుల వారికి పారదర్శకంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. అనంతరం ప్రభుత్వం రూపొందించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, ఎంపీపీలు జ్యోతి సురేష్ నాయక్, కల్లూరి హరికృష్ణ, నర్సింలు, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా నీలకంఠం బాధ్యతలు



నవతెలంగాణ-వెల్దుర్తి

వెల్దుర్తి మాసాయిపేట మండలాలకు మండల విద్యాధికారిగా కొనసాగుతున్న యాదగిరి ఆరోగ్య పరిస్థితులు సరిగా లేక విధుల్లోకి రాకపోవడంతో కొల్చారం ఎంఈఓ వెల్దుర్తి మాసాయిపేట మండలాలకు ఇన్చార్జి ఎంఈఓగా శుక్రవారం ఎమ్మార్సీ భవన్‌లో నీలకంఠం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు నాలుగు మండలాలకు ఒక్కడినే ఎంఈఓగా కొనసాగుతుందన్నారు ఈ అకాడమీ ఇయర్ ప్రారంభోత్సవం దశలోనే అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులకు అటు విద్యార్థులకు విద్యాపరంగా అన్ని వసతుల కల్పనకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. వెల్దుర్తి మాసాయిపేట మండలాలు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు.

సంబరాలు చేసుకునే అర్హత బీఆర్ఎస్‌కు లేదు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

రాష్ట్రం ఆవతరణ ఉత్సవాల్లో 21 రోజుల పాటు ఏం సాధించారని సంబరాలు చేస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఆ అర్హత లేదని టీపీసీసీ ఉపాధ్యక్షులు పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో మాజీ జడ్పీటీసీ సురేందర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేసిన పనులకు సర్పంచులకు బిల్లులు ఇవ్వలేని ప్రభుత్వం సంబరాలు ఖర్చులు పెట్టుకోవాలని అంటే వారు ఎక్కడి నుంచే పెట్టేదన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించి మిల్లులకు తరలించి 15 రోజులు గడచినా వడ్ల పైసలు రైతుల ఖాతాలో పడటం లేదన్నారు. ఆఖరి గింజ వరకు కొంటామన్న ప్రభుత్వం ఈ విషయంలో చేతులెత్తేస్తోందని విమర్శించారు. మిషన్ కాకతీయతో తెలంగాణలో గుంట ఆయకట్టు కూడా పెరగలేదన్నారు. రైతుబంధు ఒక్కటి ఇచ్చి వ్యవసాయానికి వర్తించే అన్ని సబ్సీడీలు ఎత్తేసి, రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని పేర్కొన్నారు. రైతుల కంట కన్నీరు కారుస్తుంటే ఈ ప్రభుత్వం తమ పార్టీ ప్రచారానికి ఈ సంబరాలను వాడుకుంటోందని ఎద్దేవా చేశారు. గతంలో ఇచ్చిన బీసీ కార్పొరేషన్ దరఖాస్తులను రద్దు చేసి మళ్లీ ఇప్పుడు దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తూ ప్రజలను మరోసారి మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఐదు లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని ఇందుకోసం అన్ని ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులకు సరిగ్గా జీతాలు ఇవ్వలేని ఈ పార్టీకి సంబరాలు. కాదు కదా ప్రభుత్వంలో కొనసాగే హక్కు కూడా లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని ఖచ్చితంగా ఈ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచి దాచసంగమేశ్వర్, ఎంపీటీసీ రాజునాయక్, మూసాపేట ఉపసర్పంచి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వర గుడి వద్ద నూతన బోర్ ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేటమండల పరిధిలోని నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన మడేలేశ్వర ఆలయం వద్ద మండల ప్రజా పరిషత్ నిధుల్లో భాగంగా శుక్రవారం నూతన బోర్ తవ్వకాలను ఎంపీటీసీ లద్దసురేష్, మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గెల్లు రాజ్యం, రజక సంఘం జిల్లా అధ్యక్షులు సంగు స్వామి, రైతు సమన్వయసమితి అధ్యక్షులు బీజ్జా సంపత్, చల్మెడ ఎంపీటీసీ బాల్రెడ్డి, ఆకుల బాలయ్య, రజక సంఘం సభ్యులు సంగు దుర్గయ్య,పరశురాములు,యాదగిరి, నర్సింలు, లింగస్వామి, పరశురాములు,తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో బాలాజీ హాస్పటల్ ప్రారంభోత్సవం

- పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి





నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో బాలాజీ హాస్పిటల్ అత్యాధునిక వసతులతో శుక్రవారం డాక్టర్ వీరాజీ పసులూరి డాక్టర్ కరుణశ్రీ ఆధ్వర్యంలో నిర్మించిన హాస్పిటల్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు అనంతరం మొట్టమొదటగా ఎమ్మెల్యే మదన్ రెడిని బీపీ చెక్ చేసి డాక్టర్ సేవలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడారు. వెల్దుర్తి మండలంలో సరైన డాక్టర్లు లేక హైదరాబాద్‌కు తరలి వెళుతున్న మాట వాస్తవమేనని అందుకు గ్రామంలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించాలన్నారు. అత్యాధునిక వసతులతో హాస్పటల్‌ను ప్రారంభించడం సంతోషమన్నారు. నిరుపేద ప్రజలకు సరైన వైద్యం అందించి ప్రజల చేత మన్నలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, కోఆప్షన్ మన్సూర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డితో పాటు మరి కొంతమంది ఉన్నారు.

నేటితో కంటి వెలుగు పరీక్షలు ముగింపు



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మండల పరిధిలోని గ్రామంలో గత పది రోజులు క్రితం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారంతో మండల వ్యాప్తంగా కంటి వెలుగు పరీక్షలు ముగియనున్నాయి. నస్కల్ గ్రామంలో 1555 కంటి వెలుగు పరీక్షలు నిర్వహించగా, అందుకుగాను 293 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కంటి వెలుగు కార్యక్రమం జనవరి 18న ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సౌజన్య ఆప్టోమెటిక్ వి సాగర్ డీఈవో కే వాసవి ఏఎన్ఎంలు రేణుక కళ్యాణి అంజలి ఆశా వర్కర్లు సంతోష పుష్పలత మమత రేఖ తదితరులు పాల్గొన్నారు

సీపీఐ ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్



నవతెలంగాణ-నర్సాపూర్

సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన సభకు వేలాదిమంది తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ ప్రజాగర్జన సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖాలేక్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సింగరేణి తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రాజ్యాంగ లౌకిక వ్యవస్థల పరిరక్షణకై ఈ ప్రజా గర్జన సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రజా గర్జన సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కునంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యదర్శి టి రాజా నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి, పల్ల వెంకటరెడ్డి, గోరంటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద వధువుకి పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేటమండల పరిధిలోనినార్ల పూర్ గ్రామంలో శుక్రవారం నిరుపేద కుటుంబానికి చెందిన గోపిరి మల్లేశం ఎల్లవ్వ,ల కుమార్తె రవళి వివాహానికి కంఠ రెడ్డి తిరుపతిరెడ్డి ట్రస్ట్ సహకారంతో పుస్తెమట్టెలు అందజేశారు. వధువు వివాహానికి కంఠ రెడ్డి తిరుపతిరెడ్డి సన్నిహితుల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు పుస్తే మట్టెలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మ్యాదరి రాజు, జాల పరశురాములు, దుబ్బయ్య,రాజు, భూపాల్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు

విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

2009 సంవత్సరంలో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజులో 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, జర్నలిస్టుల పిల్లలకి 50 శాతం ఫీజు మాఫీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ విద్యాశాఖ అధికారులను కోరారు. సిద్దిపేట టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా, అడ్మిషన్ తీసుకొని పాఠశాలలు నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలల్లో బుక్ స్టాల్స్‌ను నియంత్రించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, కనీస అవసరాలు అయినా మరుగుదొడ్లు, మంచినీరు, బెంచీలు, కరెంటు తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, నాన్ టీచింగ్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తక్షణమే విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుంటే భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-వెల్దుర్తి : మండల పరిధిలో యశ్వంతరావు పేట గ్రామానికి చెందిన సర్పంచి బాగమ్మ రాజా గౌడ్ కూతురు వివాహం శుక్రవారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు వివాహ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ కోఆప్షన్ మెంబర్ మన్సూర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన జంట నూరేళ్లపాటు వర్ధిల్లాలన్నారు సంసారంలో కష్టసుఖాలు ఎదురవుతాయని ధైర్యంగా ఉండి చేదోడువాదోడుగా ఉంటూ దినదినాభివృద్ధి చెందుతూ ఇంటిల్లి పాదులు సుఖసంతోషాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి అల్లిపూర్ రఘు గౌడ్ చంద్ర గౌడ్ దుర్గాప్రసాద్ అంజా గౌడ్ మాజీ సర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యతమైన విద్య



నవతెలంగాణ-దౌల్తాబాద్ : మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థిని, విద్యార్థులు సకల సౌకర్యాలు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ పొందాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల అన్ని రకాల సౌకర్యాలు తోపాటు ప్రత్యేక తరగదులు విశాలమైన మైదానం గల ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యతమైన విద్యను బోధించడం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరించడం జరిగిందని సిఆర్‌పి గాడి రాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో తక్కువ మంది విద్యార్థిని, విద్యార్థులు ఉంటారు కావున ప్రత్యేకమైన శ్రద్ధను చూపుతామన్నారు. అనుభవస్తులైన అధ్యాపక బృందం చేత విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. అదే మాదిరిగా నాణ్యతమైన విద్యను అందించడంతోపాటు ప్రతి విద్యార్థికి స్కాలర్షిప్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పర్వేజ్ కనకరాజు, రాములు, బాలయ్య, గోవర్ధన్ రెడ్డి , పాల్గొన్నారు.

11న ఆయుర్వేద,హెూమియోపతి మెగా హెల్త్ క్యాంపు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని వైశ్య భవన్‌లో లయన్స్ క్లబ్, వైశ్య సంఘం, సిద్దిపేట అద్వైత హాస్పిటల్ వారి సంయుక్త సహకారంతో ఈ నెల 11న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు వ్యాపారవేత్త కూర వేణు తెలిపారు. శుక్రవారం దుబ్బాకలో వారు మాట్లాడారు. నిపుణులైన డాక్టర్ల సలహాలు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. దుబ్బాక పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కూర వేణు (9885524563)ను సంప్రదించాలన్నారు. వడ్లకొండ శ్రీధర్, సురేష్, సుభాష్, పలువురు ఉన్నారు.

హైకోర్టు ఆదేశించినా ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు చైర్మన్‌ను నియమించరా?



- దళిత సంఘాల సూటి ప్రశ్న

నవతెలంగాణ-కొండపాక

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినా నియమించరా అని దళిత సంఘాలు సూటిగా ప్రశ్నించాయి. కూకునూర్ పల్లి మండలం లకుడారంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాలమహనాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్, యంఎస్‌పి రాష్ట్ర నాయకులు మైస రాములు, టిజెఎస్ జిల్లా అధ్యక్షుడు నీరుడు స్వామిలు విలేఖరులతో మాట్లాడారు. గత మూడు సంవత్సరాల నుంచి ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించకపోవడం నిర్లక్ష్య, వివక్షనేనని స్పష్టం చేశారు. దాడులకు గురైన బాధితులు తమ గోసను వినిపించాడానికి కమిషన్ వేదిక అవ్వటం ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుగా వుందన్నారు. కమిషన్ రాజ్యాంగ సంస్థ అన్నారు. కమిషన్‌కు పాలక మండలిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ప్రవీణ్, వేణు, కృపాకర్, స్వామి పాల్గొన్నారు

ఘనంగా ఎస్టీయు 77వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ- సిద్దిపేట

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న సంఘం ఎస్టీయు అని జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్ అన్నారు. రాష్ట్రోపాధ్యయ సంఘం (ఎస్టీయు) 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యస్టీయు జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి రంగారావుతో కలసి ఆయన మాట్లాడుతూ గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి, అనేక విజయాలు సాధించిందన్నారు. సిపియస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు పరచాలని, ఉన్నత పాఠశాలలో వెట్టిచాకిరి చేస్తున్న పండిట్, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమౌతున్న సందర్భంగా మౌళిక వసతులు కల్పించాలని, స్కావెంజర్‌లను నియమించాలన్నారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తిరిగి స్వంత జిల్లాలలో నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు, కార్యవర్గ సభ్యులు మ్యాడ శ్రీధర్, వడ్లకొండ శ్రీనివాస్, ఉండ్రాళ్ళ రాజేశం, కొర్తివాడ రాజేందర్, తోట మధుసూదన్, లింగారెడ్డి, మంగళంపల్లి శ్రీనివాస్, బిక్షపతి, కలకుంట్ల రాములు, వీరబత్తిని యాదగిరి, రామంచ రవీందర్, మోర గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటకు బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం రంగంపేట్ గ్రామంకు బస్సు సౌకర్యం లేకపోవడం వల్లన గ్రామస్థులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నరని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో మేనేజర్ సురేఖకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సంవత్సరం ప్రారంభం అవుతుందన్నారు. కావున విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని రంగంపేట్ గ్రామనికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. గత సంవత్సరం విద్యార్థులు పడ్డ ఇబ్బందుల గురించి తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కో కన్వీనర్‌లు మహేష్, సురేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఉప్పల మధుసుదన్ బీజేవైయం జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల ఉపాధ్యక్షులు వినోద్, రంగంపేట్ నాయకులు మధు, సుధాకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి కళ్యాణానికి పుస్తె మట్టెలు



- ఎంపీపీ తాండ పాండుగౌడ్

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత పోచమ్మ తల్లి కళ్యాణ మహెూత్సవానికి మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ పుస్తె మట్టెలను సమర్పించారు. అనంతరం అమ్మవారి ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్, నాయకులు మేకల శ్రీనివాస్, చిన్నబోయిని కృష్ణ, విబూది శేఖర్, నాగరాజు, తదితరులున్నారు.

ఆసరా పింఛన్ కార్డుల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆసరా పింఛన్ కార్డులను అందజేశామని ఎంపీటీసీ బెదురు తిరుపతి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో అర్హులైన ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆసరా పింఛన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురేందర్, డాకూరి భాస్కర్ రెడ్డి , బొల్లు రవి, కైలాస్, సీహెచ్ఓ హేమలత, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ భట్ల, ఏఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు చంద్రకళ, మమత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేయాలి

నవతెలంగాణ-నంగునూరు

పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేయాలని వైఎస్సార్ టీపీ మండల కన్వీనర్ ఎం.డీ.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా ఈ నెల 12న పునః ప్రారంభం కానున్న పాఠశాలలను వాయిదా వేసి సెలవులను పొడిగించాలని కోరారు. ఎండవేడిమి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వాతావరణం చల్లబడేంతవరకు పాఠశాలలు తెరవకుండా చూడాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన వార్త రిపోర్టర్ పంగ లింగం, మనం రిపోర్టర్ పంగ రవిల తల్లి గౌరవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు గురువారం రాత్రి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణు చక్రవర్తి, సర్పంచ్ పంగ కుమార్, ఉప సర్పంచ్ ఓజాల్, నాయకులు పరమేశ్వర్, రాజయ్య, వెంకట్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సాయం పేదలకు వరం

నవతెలంగాణ -గజ్వేల్

పెళ్లి సాయం పేదలకు వరంగా మారిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 5,8,11,18,16 తదితర వార్డులో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో పేదింటి పిల్లలకు షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జకీర్, కౌన్సిల్ సభ్యులు చందనా రవి, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, శ్యామల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-తొగుట : బాధిత కుటుంబాలకు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో అండగా నిలుస్తామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన ఖాజీపురం రామయ్య భార్య ఆనంతమ్మ (59) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకుని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షు డు పులిగారి శివయ్య గ్రామ రైతుబంధు అధ్యక్షుడు బండారు స్వామిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈదుగాళ్ల పర్శరాములు, వార్డు సభ్యులు పిట్ల వెంకటేశ్, ఈదుగాళ్ల వసంత తదితరులు ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ల కోసం కొట్లాడిన ఏకైక పార్టీ బీఆర్ఎస్

- నాడు రూ.3 లక్షలు, నేడు 30 లక్షలు
- పనిచేసే ప్రభుత్వానికే మరోసారి పట్టం కట్టండి-ఎంపీ కొత్త

నవతెలంగాణ-దుబ్బాక

'10 ఏళ్ల కిందట ఆడబిడ్డ పెళ్లి పెట్టుకుంటే అప్పుల పాలయ్యేటోళ్లం, చుట్టాలు, సొంతవారెవ్వరిని అడిగినా రూ.10 వేలు కూడా ఇచ్చేటోళ్లు కాదు. ఆడబిడ్డ పెళ్లిళ్లలో ఖర్చులు ఎట్లుంటయో సీఎం కేసీఆర్‌కు తెలుసు గనుకే వారికి కొంతైనా ఆర్థిక భారం తగ్గించాలన్న ఆలోచనతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.1 లక్ష 116 అందిస్తున్నాడు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచన ఇది" అని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని కోమటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో "తెలంగాణ సంక్షేమ సంబరాలు" కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణలో మహిళ ప్రజా ప్రతినిధుల కోసం వారికి



రిజర్వేషన్లను పెంచామన్నారు. 30 ఏళ్ల పట్టే ప్రాజెక్టును మూడేళ్లలో నిర్మించి నీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, కులవృత్తులకు పెన్షన్లు, రైతులకు రైతుబంధు, రైతు భీమా వంటివి గత ప్రభుత్వాలు ఎవరైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అప్పుడు బిందెడు నీళ్ల కోసం సగం దినమంతా తిరిగినం నేడు ఆ పరిస్థితి ఉందా అని అడిగారు. ఇదివరకు ఊర్లలో ఎకరానికి రూ.3 లక్షలు కూడా వచ్చేవి కావని నేడు బంగారు పంటలు పండుతున్నాయి కనుకే రూ.30- రూ.50 లక్షలు వస్తున్నాయన్నారు. ఊరూరా స్మశానవాటికలు, డంపు యార్డులు క్రీడా ప్రాంగణాలు, ప్రకృతి వనాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులు చేసి చూపించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం కొట్లాడినప్పుడు ఆంధ్ర వాళ్ళు వెక్కిరించారని, మీకు పరిపాలించుకోవడం రాదని ఎద్దేవా చేశారని, నాడు వెక్కిరిచ్చినోళ్ళే నేడు ఆగమైనారని పేర్కొన్నారు. ప్రతిపక్షపోల్లు గోతి కాడ నక్కల వలే ఎప్పుడెప్పుడు ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామా అని ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మరొకసారి పట్టం కట్టి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, ఎంఆర్ఓ సలీం మియా, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీడీవో, మున్సిపల్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్ మనదే.. గవర్నమెంట్ మనదే

- టీఎస్ ఎంఎస్ఐడిఎస్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ అసెంబ్లీ స్థానం మనదే.. గవర్నమెంట్ మనదే.. అది ఎవరూ టచ్ చేయరు చేయబోరు అంటూ టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో మహతి ఆడిటోరియంలో గజ్వేల్ నియోజకవర్గ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాస్ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ స్థానం బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందన్నారు. గజ్వేల్ అసెంబ్లీ స్థానంలో గెలిచిన వారే రాష్ట్రాన్ని పరిపాలిస్తారని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. భారతదేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రైతాంగానికి అనేక రకాల సంక్షేమ ఫలాలను రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు, మిషన్ భగీరథ, కాలేశ్వరం, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన సురక్షితమైన త్రాగునీటి అందించడం, వికలాంగ, వృద్ధాప్య, ఒంటరి మహిళల పెన్షన్లు, భారతదేశంలో ఎక్కడ లేనివిధంగా గడపగడపకు అవినీతి లేకుండా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. నియోజకవర్గంలోని కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి



సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి ప్రతి గడపకు క్లుప్తంగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, ప్రజాప్రతినిధులపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జాకీర్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, ఎంపీపీలు జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు ఏఎంసీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, సర్పంచులు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

- రైతులకు రుణమాఫీ చేయాలి
- సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం అట్లాగే ఉందని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో కోదండరాం అనుచరుడైన తెలంగాణ జన సమితి జిల్లా కోకన్వీనర్ అనిల్ రెడ్డి ఇంటికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల ఆనందంలో పడి రైతులను విస్మరించవద్దన్నారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు వస్తున్నాయన్నారు. అవి తెలంగాణను తాకి వర్షాలు పడితే రైతులు మరింత నష్టపోతారన్నారు. కాబట్టి కొనుగోలు కేంద్రాలలో ఇంకా మిగిలిపోయిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అప్పు తీసుకువచ్చి వ్యవసాయం చేసుకున్న రైతులకు ఈసారి అకాల వర్షం వలన



అప్పులే మిగిలాయన్నారు. ఇప్పటికైనా రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరిపి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అనిల్ రెడ్డి నీరుడు స్వామి, కేసర స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంస్థను కాపాడుకునే బాధ్యత మీ అందరిది

- ఎంవిఐ జనార్ధన్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



ఆర్టీసీ సంస్థను కాపాడుకునే బాధ్యత మీ అందరిపై ఉందని ఎంవిఐ జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బస్సు డిపోలో విలేజ్ బస్సు ఆఫీసర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు కష్టనష్టాలు తెలిసిన మేనేజింగ్ డైరెక్టర్ ఉన్నారని, విధులు నిర్వహించిన తర్వాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంస్థ పరిరక్షణ కొరకు విలేజ్ బస్సు ఆఫీసర్స్‌గా అదనంగా డ్యూటీ చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా రోడ్డుపైన తిరిగే సంస్థ బస్సుల గురించి, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డ్రైవర్, కండక్టర్లకు వివరించారు. డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ టిఎస్ఆర్టిసి సేవలు ప్రజలకు, విద్యార్థులకు, వికలాంగులకు, 10 శాతం రాయితీతో వివాహాలకు, శుభ కార్యక్రమాలకు బస్సులు అందిస్తున్న పథకాలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రజల వద్దకే తీసుకువెళ్లాలని ఉద్దేశంతో మేనేజింగ్ డైరెక్టర్ విలేజ్ బస్ ఆఫీసర్స్ పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రతి మండల కేంద్రానికి ఒకరు, రెండు మూడు చిన్న గ్రామాలకి ఒకరి చొప్పున విలేజ్ బస్ ఆఫీసర్లను సిద్దిపేట, దుబ్బాక డిపోలలో నియమించడం జరిగిందని తెలిపారు. ప్రజలు , విద్యార్థులు నేరుగా ఏ సమస్య ఉన్న వీరి దృష్టికి తీసుకువస్తే మేము వాటిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. నెలకు ఒకటి రెండు సార్లు గ్రామాలకు వెళ్లి ఆర్టీసీ అందిస్తున్న పథకాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ సేవలను ఉపయోగించుకొని సంస్థ మనుగడ కొరకు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి సహకరించాలని కోరారు. అనంతరం సంస్థ అందించిన కిట్లను విలేజ్ బస్ ఆఫీసర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీరు అస్లం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మహేశ్వరి, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్సు ఆఫీసర్స్ ఎంపిక

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఆర్టీసీ సేవలు ప్రజలకు సంపూర్ణంగా అందాలనే ఉద్దేశంతో విలేజ్ బస్సు ఆఫీసర్స్ ఎంపిక చేయడం జరిగిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్సు ఆఫీసర్స్‌ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గడ అధికారి ముత్యంరెడ్డి ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ సేవలు మరింత మెరుగుపడేందుకు మరొక అడుగు ముందుకు వేశారన్నారు. విలేజ్ బస్ ఆఫీసర్స్ అనే కార్యక్రమంతో ప్రజలకు ఆర్టీసీ సేవలు మరింత చేరువ కానున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో నష్టాల్లో కాకుండా లాభాల్లో నడవాలన్నదే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ విలేజ్ బస్సు ఆఫీసర్స్ ఫోన్ నంబర్లను ప్రతి గ్రామపంచాయతీలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ విలేజ్ బస్ ఆఫీసర్స్ దౌల్తాబాద్, రాయపోల్, మునిగడప, ఆర్ అండ్ ఆర్ కాలనీ, వర్గల్, జగదేవపూర్, ధర్మారం, కుకునూరు పల్లి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ప్రాంతాల కోసం నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టిసి ఎండి సజ్జనర్ సూచనల మేరకు నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ సురేఖ ఎమ్మెల్సీతో తెలిపారు.ఈ కార్యక్రమంలో గడ అధికారి ముత్యం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా,ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ వాలంటరీ వై అశోక్, బి స్వాతి, ఎస్ టి ఐ కనక లక్ష్మీ, ఏం ఎఫ్ చారి, ఎస్ డీ ఐ కెఎం రెడ్డి, డిపో సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

నిజముల్ హక్ సిద్ధిఖీ సేవలు ప్రశంసనీయం

- పీఆర్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్



నవతెలంగాణ-వర్గల్

పంచాయతీరాజ్ విభాగంలో ఏఈగా విధులు నిర్వహించిన నిజాముల్ హక్ సిద్ధిఖీ సేవలు ప్రశంసనీయమని పిఆర్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం వర్గల్ మండల రైతు వేదికలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభలో ఆయన ప్రసంగించారు. చురుకైన ఏఈగా విధి నిర్వహణలో నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన సిద్ధిఖీకి మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సంతోష వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో ఎంపీపీ లతా రమేష్ గౌడ్, జెడ్పీటీసీ బాలు యాదవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సంతోష వెంకటేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు వెంకట్ గౌడ్, మాజీ ఎంపీపీ నిమ్మ రంగారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోని వర్గల్ మండలంలో విధి నిర్వహణ కత్తి మీద సాములాంటిదన్నారు. ఈ ప్రాంతంలో పనిచేసిన ఏ అధికారైనా బదిలీ అనంతరం నెగ్గుకు రాగలరని చెప్పారు. ముఖ్యంగా పిఆర్ ఏఈ సిద్ధిఖీ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే వారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని, నూతనంగా ఏర్పాటైన పంచాయతీలలో సైతం ఆయన అభివృద్ధిని పరుగులు పెట్టించినట్లు తెలిపారు. అధికారికి బదిలీ అనేది సర్వసాధారణమే అయినప్పటికీ పిఆర్ ఏఈగా సిద్ధిఖీ అందించిన ఉత్తమ సేవలు ఎప్పుడూ మరిచిపోమని, భవిష్యత్తులో ఉన్నత అధికారిగా మళ్లీ ఈ ప్రాంతానికి బదిలీపై రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు నాగరాజు, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సంధ్యా జాని, లతా శివరాంగౌడ్, హనుమంతు, మంజుల కృష్ణ, కరుణాకర్ రామచంద్రం, శ్రీనివాస్, ఎంపీటీసీలు జనార్ధన్, భీంరెడ్డి, బిక్షపతి రెడ్డి, నేతలు పడిగే రాజు, క్రిష్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మర్కుక్

విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు బిల్లులను తీసుకుని పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గణేశపల్లి గ్రామంలోని విత్తన షాప్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విత్తన డీలర్లులందరూ స్టాక్, ధరల పట్టిక బోర్డులను రైతులకు కనపడేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపారులు విత్తనాల బిల్లులు, ఇన్వాయిస్‌లను తనిఖీ సమయంలో అధికారులకు చూపాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారి టి నాగేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో శ్రీనివాస రైతు సేవా కేంద్రం దుకాణంలో జిల్లా స్క్వాడ్ కె శివప్రసాద్ డీఏఓ, పద్మ , సిద్దిపేట ఏడీఏ అకస్మాత్తుగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్ టెక్ కంపెనీకి చెందిన స్టాలిన్ పత్తి రకాన్ని ఏచ్‌టి కాటన్ కొరక పరీక్షించారు. ఆ పత్తి విత్తనాల్లో ఏచ్‌టి లేదని నిర్ధారించారు. వారు డీలర్లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విత్తనాల్లో డీలర్లు పాటించవలసిన సూచనలు వివరించారు. పత్తి విత్తనాలను హెూల్ సేల్ డీలర్స్ సిద్దిపేట జిల్లాలోని డీలర్స్ కు మాత్రమే అమ్మాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు అమ్మ రాదన్నారు. తప్పనిసరిగా డీలర్లు అమ్మిన





విత్తనాలకు బిల్లు ఇవ్వాలని, అలాగే స్టాక్ రిజిస్టర్‌ను ప్రతిరోజు అప్డేట్ చేసుకోవాన్నారు. రైతులకు గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కువ అమ్మ రాదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ రకమైన పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించరాదన్నారు. అలాంటిది ఏమైనా తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వరి విత్తనాలు లైసెన్స్ కలిగిన కంపెనీల విత్తనాలను మాత్రమే అమ్మాలని తెలిపారు. పంటకాలం 120 నుంచి 130 రోజుల వరి రకాలను మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. ప్రైవేటు వరి విత్తనాల డస్ క్యారెక్టర్స్ తప్పనిసరిగా కంపెనీ నుంచి సమాచారం తీసుకోవాలని తెలిపారు. రైతులకు అమ్మే పత్తి విత్తన రకాన్ని డిస్ప్లేలో పెట్టి వాటి పంటకాలం, గుణగణాలు ఎల్బీ రేషియో వ్రాసి ఉంచాన్నారు. 130 రోజుల కన్నా ఎక్కువ కాలపరిమితి గల రకాలను, ఎల్బీ రేషియో 2.5 కన్నా తక్కువ ఉన్న రకాలను అమ్మ రాదని తెలిపారు.ఈ తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, సిద్దిపేట ఏడిఏ శ్రీమతి పద్మ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు అండగా నిలుస్తున్న ఎంపీ



నవతెలంగాణ-తొగుట

నిరుపేద కుటుంబాలకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ పేర్కొన్నారు. శుక్రవారం తొగుట మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన చింత మంజుల కుమార్తె అనూష వివాహానికి ఎంపీ ఆదేశాల మేరకు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్యలతో కలిసి పుస్తె మట్టెలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ నిరుపేద కుటుంబాలకు తన వంతుగా సహకారం అందిస్తున్నానని తెలిపారు. ఇప్పటి వరకు 98 మంది వివాహాలకు పుస్తె మట్టెలు అందించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుతారి రమేష్, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మాదాసు అరుణ్ కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రామోళ్ల అనిల్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిలివేరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సిహెచ్ నర్సింలు, మహేష్, ఒగ్రె ఆంజనేయులు, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16న ఖేలో ఇండియా సైక్లింగ్ ఎంపికలు

- జిల్లా యువజన సంక్షేమ, క్రీడాల శాఖ అధికారి నాగేందర్

నవతెలంగాణ-సిద్దిపేట

ఖేలో ఇండియా సిద్దిపేట జిల్లా సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం ఏడు గంటలకు సైక్లింగ్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖ అధికారి నాగేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 12 నుంచి 16 సంవత్సరాల మధ్య ఉన్న బాల, బాలికలకు సైక్లింగ్‌లో 16న ఉదయం ఏడు గంటలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైక్లింగ్‌లో శిక్షణ పొందాలని, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికల కోసం వచ్చేవారు ఆధార్ కార్డు, పాఠశాల బోనఫైడ్, డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్, రెండు



పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు. ఎంపికైన వారికి సైక్లింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సైక్లింగ్ శిక్షకులు సంజీవ్ (9640760193)ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకన్న పాల్గొన్నారు.

వితంతు మహిళలకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దుబ్బాక పట్టణ కేంద్రంలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన 'తెలంగాణ సంక్షేమ సంబరాల్లో' మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వితంతు మహిళలకు ఉపాధి కొరకు మంజూరైన చెక్కులను ఎంపీ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా 100 శాతం సబ్సిడీతో మంజూరైన ఒక్కొక్కరికి రూ.30 వేలు (ఎస్సీ-50, ఎస్టీ-15, బీసీ-03) చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, ఎంపిపి కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, కౌన్సిలర్లు, ఎంఆర్ఓ ఎండి.సలీం మియా, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.